సాక్షి
ములుగు

మంగళవారం | 7 | మే | 2024



ప్రచారం.. కొత్త పుంతలు

ఎన్నికల ప్రచారం కొత్త పుంతలు తొక్కుతోంది. సోషల్ మీడియాతో పాటు వాయిస్‌కాల్స్ ద్వారా అభ్యర్థులు ఎలక్షన్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు.

- IIలో▸



నగదు పట్టివేత

పార్లమెంట్ ఎన్నికల తనిఖీల్లో భాగంగా మానుకోట పట్టణంలో పోలీసులు రూ.1.67లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

- IIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41°/27°

జిల్లాలో ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. రాత్రి సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎన్నికల సిబ్బందికి రక్షణ కల్పించాలి

ములుగు: ఎండాకాలంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు అవుతున్న కారణంగా పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి రక్షణ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మీరా రాజునాయక్ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించే క్రమంలో ఎక్కువ వాహనాలను అందుబాటులో ఉంచాలని కోరారు. విధులు నిర్వహించే చోట కూలర్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, చల్లని నీరు ఉండే విధంగా చూడాలని విన్నవించారు. ఎలక్షన్స్ పూర్తయిన తర్వాత సిబ్బంది ఇంటికి వెళ్లేందుకు వాహనాలు ఏర్పాటు చేయాలని వివరించారు.

బలరాంనాయక్‌కు మంత్రి పరామర్శ



ములుగు: మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తల్లి లక్ష్మీబాయి అనారోగ్యంతో శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో మంత్రి ధనసరి సీతక్క సోమవారం హనుమకొండలోని తన స్వగృహంలో బలరాంనాయక్‌ను కలిసి పరామర్శించారు. లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి సీతక్క వెంట డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, ఎల్‌డీఎం కో ఆర్డినేటర్ పులి అనిల్‌కుమార్ ఉన్నారు.

10న జాతర వేలం పాటలు

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈ నెల 8న నిర్వహించాల్సిన జాతర వేలం పాటలను అనివార్య కారణాలతో 10వ తేదీకి వాయిదా పడినట్లు ఆలయ ఇన్‌చార్జ్ కార్యనిర్వహణ అధికారి ఎస్.మహేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు జరుగనున్న లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల(జాతర) సందర్భంగా నెల రోజుల పాటు వివిధ రకాల వ్యాపారాల నిర్వహణకు ఈ నెల 10న ఉదయం 11గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిబంధనల మేరకు షరతులతో కూడిన బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ పరిధిలో కొబ్బరికాయలు విక్రయించేందుకు రూ.లక్ష, భక్తులు స్వామివారికి సమర్పించే పుట్టు వెంట్రుకలు(తలనీలాలు) పోగు చేసుకునేందుకు రూ.2లక్షలు, పూలు, పూల దండలు అమ్ముకునేందుకు రూ.5వేలు, చెప్పుల స్టాండ్ నిర్వహణకు రూ.5వేలు, ఫొటోలు తీసుకునేందుకు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని వివరించారు.

'అక్షర ఐకేర్'లో నకిలీ వైద్యులు?

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని అక్షర ఐకేర్ ఆస్పత్రిలో ఎలాంటి సర్టిఫికెట్లు లేకుండానే చికిత్సలు చేస్తున్నట్లు స్థానిక అప్తాల్మిక్ అసిస్టెంట్ దిలీప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్షర ఐ కేర్ ఆస్పత్రిలో ఎలాంటి సర్టిఫికెట్లు లేకుండా వైద్యం, కంటి అద్దాలు ఇస్తున్నట్లు ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. వెంటనే అధికారులు తనిఖీలు చేసి నకిలీ వైద్యులు, షాపులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ విషయంపై జిల్లా వైద్యాధికారి అప్పయ్యను సాక్షి వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, ఈ విషయంపై ఆరాతీసి చర్యలు తీసుకుంటామని వివరించారు.

డిగ్రీ సెమిస్టర్ల పరీక్షలు షురూ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ రెండు, ఆరో సెమిస్టర్ల పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి సందర్శించారు. ఆయన వెంట నర్సింహాచారి, తిరుమలాదేవి ఉన్నారు.

నేడు వరంగల్ నగరంలో సీఎం రోడ్‌షోలు

హన్మకొండ చౌరస్తా: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మంగళవారం వరంగల్ నగరంలో రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లలో పాల్గొననున్నారు. సాయంత్రం 5 గంటలకు వరంగల్ తూర్పులోని పోచమ్మమైదాన్ జంక్షన్‌లో కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారు. 6గంటలకు వేయిస్తంభాల గుడి నుంచి హనుమకొండ చౌరస్తా వరకు రోడ్‌షో నిర్వహిస్తారని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. అనంతరం హనుమకొండ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తారని తెలిపారు.

భద్రత మాది.. బాధ్యత మీది

స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పిస్తాం..

- సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు
- అన్ని రాజకీయ పార్టీలతో సమీక్షలు
- నాలుగు జిల్లాల అధికారులతో సమన్వయం
- అడుగడుగునా చెక్ పోస్టులు, ప్రత్యేక బృందాల తనిఖీలు
- డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలకు తావులేకుండా చర్యలు
- 'సాక్షి'తో మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



సుధీర్ రాంనాథ్ కేకన్, ఎస్పీ

సాక్షి, మహబూబాబాద్:

'ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు కీలకం. మంచి ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే అవకాశం రాజ్యాంగం కల్పించిన గొప్ప హక్కు ఓటు.. దీనిని విస్మరించొద్దు. ఓటర్లు స్వేచ్ఛాయుతంగా ఓటు వేసే అవకాశం కల్పించడం మా విధి.. నిర్భయంగా ఓటు వేసే బాధ్యత ఓటర్లది' అని మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చేస్తున్న కసరత్తు.. ఏర్పాట్లు.. ప్రజలను అప్రమత్తం చేయడం మొదలైన అంశాలపై ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

సరిహద్దుల్లో చెక్ పోస్టులు..

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించాం. అలాగే బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర రద్దీ ప్రాంతాలు, ప్రధాన రహదారులపై ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఈ తనిఖీల్లో ఇప్పటి వరకు 16కేసుల్లో రూ.86,29,978 విలువచేసే 12068.50లీటర్ల మద్యం, 271.080 లీటర్ల నాటుసారా, 9030 కేజీల నల్లబెల్లం, 714 కేజీల పటికను సీజ్ చేశాం. అదేవిధంగా రూ.10,76,650 విలువచేసే 47,830 కిలోల గంజాయి, ఇతర మత్తు పదార్థాలను పట్టుకున్నాం. నిబంధనలకు మించి డబ్బులు తీసుకెళ్తున్న 35 మంది వద్ద నుంచి రూ.72,76,740 నగదు స్వాధీనం చేసుకున్నాం.

సమన్వయం..

మహబూబాబాద్ పార్లమెంట్ నాలుగు జిల్లాల పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఉంది. పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రం ఇక్కడే కావడంతో వరంగల్, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ కలెక్టర్ నేతృత్వంలో సమీక్షలు నిర్వహించాం. రాజకీయ నాయకులతో మాట్లాడాం. పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్లు, రవాణా సౌకర్యాలు, ఓటర్లు కేంద్రాలకు వెళ్లేందుకు చర్యలు మొదలైన అంశాలపై చర్చించాం. పలు కేంద్రాలకు రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ఆయా ప్రాంతాలకు ఓటర్లను తరలించేందుకు ప్రణాళిక రూపొందించాం. సిబ్బంది తరలింపు నుంచి ఈవీఎంల భద్రత వరకు అన్నీ కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

స్వేచ్ఛగా ఓటు వేసేలా..

ప్రతి పౌరుడు స్వేచ్ఛగా ఓటు వేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా జిల్లాలోని గంగారం, కొత్తగూడ వంటి ప్రాంతాల్లో కూడా అక్కడి ప్రజలకు అవగాహన కల్పించాం. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం జిల్లాలోని హోంగార్డు నుంచి ఉన్నతాధికారి వరకు ఉన్న ఫోర్స్‌తోపాటు, ఇతర బలగాలు మొత్తం 2,500 మంది మేరకు ఎన్నికల డ్యూటీలో పాల్గొనే విధంగా ఉన్నతాధికారుల సహకారం తీసుకున్నాం. ప్రజలకు చెప్పేది ఒక్కటే.. మీకు భద్రత కల్పిస్తాం.. భరోసాగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటేయండి.

సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తుగా మానుకోట జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాం. జిల్లాలో 785 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఇందులో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని 46 ప్రాంతాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించాం. ఆయా చోట్ల కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. స్థానికుల సహకారంతో ఎన్నికలపై ప్రచారం నిర్వహించాం. అదే విధంగా 18 మంది వద్ద ఉన్న లైసెన్స్‌డ్ గన్స్ స్వాధీనం చేసుకున్నాం. వీటితోపాటు నేర చరిత్ర ఆధారంగా 285 కేసుల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉన్నవారు.. నాన్ బెయిలబుల్ వారెంట్స్, రౌడీషీట్ ఉన్న 681 మందిని బైండోవర్ చేశాం.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేస్తాం

జిల్లా పౌరసరఫరాల అధికారి రాంపతి

సాక్షి ఎఫెక్ట్..



మాట్లాడుతున్న రాంపతి

ఏటూరునాగారం: జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉన్న ధాన్యం వెంటనే కొనుగోలు చేసి మిల్లర్లకు తరలిస్తామని జిల్లా పౌరసరఫరాల అధికారి రాంపతి అన్నారు. సోమవారం సాక్షిలో అకాల వర్షం.. రైతుల ఆగమాగం శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఏటూరునాగారంలోని జీసీసీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆదివారం వచ్చిన అకాల వర్షానికి రైతులు ధాన్యంపై పరదాలను కప్పారని తెలిపారు. ధాన్యం తడవకుండా ఉండేందుకు చర్యలు చేపడుతామన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిర్వాహకులు ఎప్పుడూ ఉండాలని, ధాన్యం తడవకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించామని వివరించారు.

రామప్పలో అర్చకుల సమావేశం



రామప్ప ఆలయంలో సమావేశమైన అర్చకులు

వెంకటాపురం(ఎం): దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని రామప్ప దేవాలయంలో సోమవారం జిల్లాకు చెందిన ధూపదీప ఆలయాల అర్చకులు సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఆలయాలను రిజిస్ట్రేషన్ చేపించాలని, దేవాలయాల పేరిట భూములు ఉంటే వాటి వివరాలను ఎండోమెంట్ శాఖలో నమోదు చేయించాలని డివిజనల్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, రామప్ప ఈఓ బిల్లా శ్రీనివాస్ అర్చకులకు సూచించారు. దేవాలయాల పేరు మీద బ్యాంకు ఖాతాలు తెరవాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ముడుంబా రఘునాథచార్యులు, హరీశ్‌శర్మ, ఉమాశంకర్, ఆలయ సిబ్బంది మార్క సంతోష్, అవినాష్‌రెడ్డి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులు ఆందోళన చెందవద్దు



మహిళను పరీక్షిస్తున్న డీపీఎంఓ సాంబయ్య

వెంకటాపురం(ఎం): కుష్ఠువ్యాధిగ్రస్తులు ఆందోళన చెందవద్దని, వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా మందులు అందిస్తామని జిల్లా డీపీఎంఓ సాంబయ్య తెలిపారు. లెప్రసీ సర్వేలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని సబ్‌సెంటర్‌లో 15మందిని పరీక్షించగా అందులో ఒకరికి కుష్ఠు వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, ఏఎన్‌ఎంలు స్వప్న, కనకలక్ష్మి, ఆశ వర్కర్లు మాధవి, సౌజన్య, సరోజన, శోభ, ఇందిర, కవిత, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి తుమ్మల రాక

వాజేడు: మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ తరఫున ప్రచారం చేయడానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం వాజేడుకు వస్తున్నారు. మంత్రిగా ఆయన పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వాజేడులో ఆయన నేడు తొలిసారిగా పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఏర్పాట్లు చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పాలి

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌బాబు

వెంకటాపురం(ఎం): మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కి ఇచ్చిన హామీలను నేరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ, మహిళలకు నెలకు రూ.2,500, వివాహం చేసుకునే మహిళలకు తులం బంగారం అంటూ తదితర ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలను, నాయకులను ప్రలోభపెట్టి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవితను అధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, నాయకులు పోరిక గోవింద్‌నాయక్, గై అశోక్, పోరిక హర్జినాయక్, పోశాల వీరమల్లు, తండా రమేష్, మేడబోయిన ఆశోక్, ఆశాడపు దేవేందర్, భాష బోయిన పోశాలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఎస్‌ఎస్‌తాడ్వాయి: ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలు వడదెబ్బ భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యాధికారి రణధీర్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి డీఎంహెచ్‌ఓ అప్పయ్య హాజరై మాట్లాడారు. ఉపాధిహామీ కూలీలు వడదెబ్బకు గురికాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు. కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. నీళ్లు ఎక్కువగా తాగాలని కూలీలకు సూచించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ పవన్ కుమార్, డీపీఎంఓ సంజీవరావు, సీహెచ్‌ఓ శకుంతల, పల్లె దవాఖాన వైద్యాధికారులు స్వాతి, శ్యామ్, హెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



గంగారంలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్

గంగారం: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. సోమవారం మండలంలోని పెద్ద ఎల్లాపురంతోపాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తరఫున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన బలరాంనాయక్.. ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. అనంతరం గంగారంలో యువకులతో కలిసి క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు అశోక్, ఏఐసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా నారాయణరెడ్డి, కాంగ్రెస్ కొత్తగూడ, గంగారం మండలాల అధ్యక్షులు వజ్జ సారయ్య, వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిళి, జెడ్పీటీసీలు ఈసం రమ, విజయ రూప్‌సింగ్, ఎంపీపీలు సువర్ణ పాక సరోజన జగ్గారావు, పుష్పలత, మాజీ సర్పంచ్‌లు చుంచ వెంకటలక్ష్మి, సాంబయ్య పాల్గొన్నారు.

ఈవీఎంల కమిషనింగ్ పకడ్బందీగా పూర్తిచేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



చిత్రామిశ్రాతో మాట్లాడుతున్న కలెక్టర్



సంతకం చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు: ఈవీఎంల కమిషనింగ్‌ను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల స్ట్రాంగ్ రూంలో నిర్వహిస్తున్న ఈవీఎం, వీవీప్యాట్, సీయూల కమిషనింగ్ ప్రక్రియను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, అదనపు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ నెల 13వ తేదీన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు ములుగు అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన 768 బ్యాలెట్ యూనిట్లు, 384 కంట్రోల్ యూనిట్స్, 430 వీవీప్యాట్లను 25 టేబుళ్ల ద్వారా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు కమిషనింగ్ ప్రక్రియను చేపడుతామని కలెక్టర్ వివరించారు. అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని సూచించారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

ఓటుహక్కును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. స్విప్ నోడల్ అధికారి డీఆర్‌డీఏ శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం ఓటర్ అవగాహన సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. దీనిలో భాగంగానే స్విప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతూ ప్రజలలో ఓటు హక్కుపై చైతన్యం తీసుకువస్తున్నట్లు వివరించారు. ఈ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును నేను సద్వినియోగం చేసుకుంటున్నాను, నేను అనే నినాదం ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. పోలింగ్ శాతంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి తుల రవి, డీపీఆర్‌ఓ రఫిక్, డీపీఎం సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టులకు త్వరలోనే మంచి వేతనాలు

ఎంజీఎం: ఫార్మసిస్టులకు త్వరలోనే మంచి వేతనాలు అందుతాయని తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ అన్నారు. సోమవారం సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందకట్ల శరత్‌బాబు అధ్యక్షతన డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో జరిగిన హనుమకొండ, వరంగల్ జిల్లా కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 35 ఏళ్లుగా పీఆర్‌సీలలో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఫార్మసిస్టులకు అన్యాయం జరుగుతుందన్నారు. విద్యార్హతలు, విధులను పరిగణనలోకి తీసుకొని న్యాయం చేయాలని పీఆర్‌సీ కమిటీ విన్నవించామని, దీనిపై వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం సుదర్శన్ గౌడ్‌ను సన్మానించారు. సమావేశంలో సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు దేవంభట్ల ప్రకాశ్‌రావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అవినాష్, నాయకులు నార్ల వేణు, సూరయ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.


పీఎం సెక్యూరిటీ ట్రయల్‌రన్

ఖిలా వరంగల్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 8న(బుధవారం) లక్ష్మీపురం మైదానంలో నిర్వహించే సభకు ప్రధాని నరేంద్ర మోదీ రానున్నారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి భద్రతాధికారులు(సెక్యూరిటీ) సోమవారం మధ్యాహ్నం ప్రత్యేక హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి మామునూరు విమానాశ్రయానికి వచ్చారు. హెలిపాడ్ నుంచే అధికారులు విమానాశ్రయం పరిసరాలను పరిశీలించారు. భద్రతపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులను అడిగి తెలుసుకున్నారు. హెలికాప్టర్ ద్వారా ట్రయల్ రన్ నిర్వహించారు.

వైన్స్‌లో బీర్ల కరువు

బెల్ట్ షాపులకు తరలుతున్న వైనం

- ఒక్కో బీరుపై రూ.50, క్వార్టర్‌పై రూ.40 అధికం
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



ములుగు: ఎండాకాలంలో ఉష్ణోగ్రతలు పెరిగాయంటే ఎక్సైజ్ శాఖకు బీరు రూపేణ డిమాండ్ పెరగడం సర్వసాధారణం. దీనికితోడు యువత చల్లనిబీర్లంటే పడిచస్తుంటారు. అలాంటి వారిని క్యాష్ చేసుకొని సొమ్ముచేసుకుంటుంది ఎక్సైజ్ శాఖ. గత కొన్ని రోజులుగా ఎండపూట తాగడానికి చల్లనిబీర్లు దొరకడం లేదనే గోల వినిపిస్తోంది. ఎక్సైజ్ అధికారులు వైన్స్ షాపుల యజమానులతో కుమ్మక్కై డిస్టలరీల నుంచి వస్తున్న బీర్లను చడిచప్పుడు కాకుండా గ్రామాల్లోని బెల్టు షాపులకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఎండాకాలం ప్రవేశించినప్పటి నుంచి ములుగు సబ్ డివిజన్‌లో ఈ రకం ఉమ్మడి దందా మూడు పువ్వులు ఆరుకాయలు అన్న చందాన నడుస్తోంది.

ఒక్కో బీరుపై రూ. 50 అదనం

ఉదాహరణకు వైన్స్‌లో ప్రభుత్వ రేటు ప్రకారం కింగ్‌ఫిషర్ లైట్ బీరు రూ.150. అదే బీరు రేటుకు గ్రామాల్లోని బెల్టు షాపులకు వచ్చే సరికి రెక్కలు వస్తున్నాయి. ఏకంగా ఒక్కో బీరును రూ. 200లకు అమ్ముతున్నారు. ఇలా అన్ని రకాల కంపెనీల బీర్ల ధరల పరిస్థితి అంతే. ఇదేంటని బెల్టుషాపుల వ్యాపారులను అడిగితే తమకు ఒక్కో బీరుకు రూ. 20 అదనంగా ఇస్తున్నారని, కూలింగ్ ఛార్జీలు, సిట్టింగ్ వంటివి చూసుకొని రూ. 50 అదనంగా అమ్ముకుంటున్నామని దర్జాగా చెబుతున్నారు. బీరుతో పోలిస్తే లిక్కర్, విస్కీ ధరలు కాస్తంత తక్కువగా ఉన్నాయి. వాటిని క్వార్టర్‌పై రూ.40 ఎక్కువగా వసూలు చేస్తున్నారు. అంటే ఫుల్ బాటిల్ తీసుకుంటే రూ.160 అదనం అన్నమాట. ఈ లెక్కన మద్యం బాబులకు రోజువారీగా వందల నుంచి వెయ్యి వరకు జేబులకు చిల్లు పడుతున్న పరిస్థితులు ఉన్నాయి.

కోడ్ ఆఫ్ కండక్ట్ పేరుతో..

ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల వేళ గ్రామాల్లో మద్యం అమ్మకాలను అరికట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు నిమ్మకునీరెత్తనట్లుగా నడుచుకుంటున్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పేరుతో గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై దాడులు చేయ డం , టార్గెట్ పూర్తి కావాలనే ఉద్దేశ్యంతో గతంలో గుడుంబా కాసిన వారిని పట్టుకొని స్థానిక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయడం పరిపాటిగా మారింది. ప్రతి రోజూ గ్రామాల్లో తిరిగే ఎక్సైజ్ అధికారులు, సిబ్బందికి బెల్టు షాపులు కనిపించడం లేదా అనేది మొదటి ప్రశ్న. అధికారులు తిరుగుతున్నారని తెలిసి దర్జాగా విక్రయిస్తున్న బెల్టు షాపుల వ్యాపారులను చూస్తే వీరికి ఇంత ధైర్యమెక్కడిదబ్బా అన్నట్లుగా వచ్చే రెండో ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన అధి కారులు ఎవరు ఏమనుకుంటే మాకేంటి అన్నట్లుగా నవ్వుకుంటూ కనిపిస్తున్నారని బయటగుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో వివరణకు ములుగు ఎక్సైజ్ సీఐ సుధీర్‌ని ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా సమాధానం ఇవ్వలేదు.

వాకర్లతో మాట్లాడి.. వాలీబాల్ ఆడి

వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ సోమవారం ఉదయం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్లను కలిసి కమలం పువ్వు గుర్తుకు ఓటే య్యాలని అభ్యర్థించారు. స్టేడియం లోని వాలీబాల్ గ్రౌండ్‌లో క్రీడాకారుల తో కలిసి కాసేపు వాలీబాల్ ఆడారు.

– హన్మకొండ చౌరస్తా



వాలీబాల్ ఆడుతున్న అరూరి రమేష్

ట్రాన్స్‌జెండర్లతో ప్రతిజ్ఞచేయిస్తున్న అధికారులు



ఓటు.. మా బాధ్యత

స్వీప్–2024 అవగాహన కార్యక్రమంలో భాగంగా వరంగల్ లోక్‌సభ పరిధి వరంగల్ తూర్పు నియోజకవర్గానికి సంబంధించి సోమవారం బల్దియాలో ట్రాన్స్‌జెండర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్లతో ప్రతిజ్ఞ చేయించగా.. ఓటు వేయడం తమ బాధ్యతని వారు పేర్కొన్నారు. – వరంగల్ అర్బన్

రూ.1.67 లక్షల నగదు పట్టివేత



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణానికి చెందిన వీర భద్ర బార్ అండ్ రెస్టారెంట్ మేనేజర్ సముద్రాల శ్రీనివాస్ సోమవారం రూ.1.67 లక్షలు తరలిస్తున్నాడు. ఆ నగదుకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు అప్పగించారు. ఈ తనిఖీల్లో టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై శివ, పీసీలు సక్రాం, వీరన్న పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి బాధ్యత నాదే..

● రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కొత్తగూడ: 'పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ఓట్లు వేయించే బాధ్యత మీరు తీసుకోండి.. గ్రామాల అభివృద్ధి బాధ్యత నేను తీసుకుంటానని' రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. పాకాల సరస్సు నుంచి ఏజెన్సీ గ్రామాలకు సాగు నీరు అందిస్తామన్నారు. గిరిజనేతరుల పోడు భూముల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఉన్న వాగులు, రోడ్ల సమస్యలు ఇక ముందు ఉండవన్నారు. ఈ పనులన్నీ జరగాలంటే కేంద్ర అటవీ శాఖ అనుమతులు తప్పని సరని, అందుకు బలరాంనాయక్‌ను గెలిపిస్తే తనకు అండగా నిలిచి ఢిల్లీ నుంచి అనుమతులు తీసుకువస్తారని వివరించారు. అనంతరం మానుకోట పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పొరిక బలరాంనాయక్ మాట్లాడుతూ తనకు ఓటు వేస్తే రాహుల్‌గాంధీకి వేసినట్లే అన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే ఏజెన్సీ గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రాధ, డాక్టర్ అనిల్‌కుమార్, పైడాకుల అశోక్, చల్లా నారాయణరెడ్డి, వజ్జ సారయ్య, ఎంపీపీ బానోతు విజయరూప్‌సింగ్, జెడ్పీటీసీ పుష్పలత, ఎంపీటీసీలు జంపయ్య, సాలూకి, పుష్పలత, నాయకులు మొగిళి, వజ్జ వెంకటలక్ష్మి, రణధీర్, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

బీజేపీ, కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలి

● కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి
● ఎమ్మార్పీఎస్–టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

హన్మకొండ: పార్లమెంట్ ఎన్నికల్లో మనువాద బీజేపీ, కపట ప్రేమ చూపే కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని ఎమ్మార్పీఎస్–టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాణాలకు తెగించి కొట్లాడి సాధించిన తెలంగాణ అభివృద్ధి, రాష్ట్రంలోని అణగారిన వర్గాల అభివృద్ధిపై కేసీఆర్‌కు మాత్రమే చిత్తశుద్ధి ఉందన్నారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం, సచివాలయం, అమరవీరుల స్మారక చిహ్నం నిర్మించడంతో పాటు, సాగు నీరు అందించి, సాగు విస్తీర్ణం పెంచి రాష్ట్రాన్ని ధాన్యాగారంగా మార్చిన మహానాయకుడు కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మూడు నెలలకే ఆగమవుతోందన్నారు. ఒక్క నిమిషం కరెంట్ పోని రాష్ట్రాన్ని ప్రస్తుతం కోతల మయం చేశారన్నారు. కేసీఆర్‌తోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, బీఆర్ఎస్‌కు మాదిగల సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. బీజేపీ కేవలం ఓట్ల కోసమే మాదిగలను వాడుకుంటుందని విమర్శించారు. మాదిగలను కాంగ్రెస్ పార్టీ చిన్నచూపు చూస్తోందన్నారు. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెబుతామన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్–టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా, నాయకులు ఈదునూరి యాకన్న, పొట్టపెంజర రమేష్, మేడ స్వామి, బొచ్చు మురళి, ధర్మారపు శ్రీకాంత్, ఎలకటి రాజయ్య, ఇరుగు యాకయ్య, బక్కి రావి, మహేష్, జన్ను సంజీవ్, ప్రతాప్, మంద రాజశేఖర్, సురేందర్, గోల్కొండ శ్రీనివాస్, దయాకర్, జయరాజ్, విజయ్‌కాంత్, రాజశేఖర్, విజయ్‌కాంత్, కుమార్ పాల్గొన్నారు.

ప్రచారం.. కొత్త పుంతలు

వాయిస్ కాల్స్‌తో ఎలక్షన్ క్యాంపెయిన్..

● సోషల్ మీడియాపై నేతల దృష్టి
● ఫేస్‌బుక్, ట్విట్టర్ (ఎక్స్) ద్వారా విస్తృత ప్రచారం
● ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు



కాజీపేట: మొబైల్.. ప్రస్తుతం ప్రతీ ఒక్కరి దైనందిన జీవితంలో భాగస్వామ్యమైంది. ఉదయం నిద్ర లేచింది మొదలు.. రాత్రి మళ్లీ నిద్రించే వరకు చేతిలో అతుక్కుపోవాల్సిందే. టీ తాగుతున్నా.. భోజనం చేస్తున్నా.. ఇతర ఏ పని చేస్తున్న ఫోన్ చూడకుండా క్షణ కాలం ఉండలేని పరిస్థితి ఉంది. మానవ జీవితంలో ఇంతలా ఇమిడిపోయిన ఫోన్ అవసరాన్ని రాజకీయ నేతలు చక్కగా క్యాష్ చేసుకుంటున్నారు. ఒకవైపు సభలు, సమావేశాలు నిర్వహిస్తూనే.. మరోవైపు సోషల్ మీడియాలో ప్రచారం పరుగులెత్తిస్తున్నారు. ఇందులో భాగంగా అభ్యర్థులు గతంలోకంటే ఈసారి ప్రచారానికి ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నారు. వాయిస్ మెయిల్ కాల్స్ ద్వారానే కాకుండా, సోషల్ సైట్స్ ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్ (ఎక్స్)ను ఉపయోగించుకుంటున్నారు. 'తాము ఫలానా పార్టీ తరఫున పోటీచేస్తున్నాం.. మమ్మల్ని గెలిపిస్తే మన ప్రాంతంలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తాం. అందుకోసం మమ్మల్నే గెలిపించాలంటూ' కోరుతున్నారు. మరికొందరు ఓ అడుగు ముందుకేసి తమ అభ్యర్థిని గెలిపిస్తే మీ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాడని తెలుపుతున్నారు.

వాయిస్ మెయిల్ కాల్స్‌తో ప్రచారం

రెండు రోజుల నుంచి వాయిస్ మెయిల్ కాల్స్, ఫోన్ కాల్స్ ద్వారా అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. ప్రస్తుతం జరుగనున్న ఎన్నికల్లో యువత ఓట్లే కీలకం కావడంతో వారిని ఆకట్టుకోవడానికి ఫేస్‌బుక్, ట్విట్టర్‌ను వినియోగించుకుంటుండడం గమనార్హం. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందుతున్న తరుణంలో ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఇంటర్‌నెట్ వినియోగిస్తున్నారు. ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రావడంతో స్మార్ట్‌ఫోన్ల ద్వారా యువకులు అధికశాతం తమ అరచేతిలోనే ప్రపంచాన్ని చూస్తున్నారు. దీనికి తోడు అభ్యర్థులు ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా చాటింగ్ చేస్తున్నారు. యువత కూడా వీటి ద్వారా తమ అభిప్రాయాలను నిర్మోహమాటంగా వెలిబుచ్చుతున్నారు. పత్రికలు, టెలివిజన్ తరువాత ఇంటర్‌నెట్‌పైనే దృష్టి సారిస్తుండడంతో యువతను ఆకట్టుకోవడానికి రాజకీయ నేతలు తమపార్టీల ద్వారా చేపట్టే కార్యక్రమాలు, ప్రజల కోసం చేసే కార్యక్రమాల సందేశాలను ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌తేదీ సమీపిస్తుండడంతో ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో రాజకీయ పార్టీల చిత్రాలే అధికంగా కనిపిస్తున్నాయి. వరంగల్ లోక్‌సభ.. రాజకీయంగా చైతన్యం కలిగిన నియోజకవర్గమైనప్పటికీ మెజార్టీ ఓటర్లు సంప్రదాయ ఓటర్లే ఉంటారు. అయితే ఎన్నికల సంఘం నూతన ఓటర్ల నమోదుపై విస్తృతంగా ప్రచారం చేయడంతో ఈ మధ్య కాలంలో దాదాపు 24 వేల మంది కొత్త ఓటర్లుగా నమోదు చేయించుకున్నారు. దీంతో ఈసారి జరుగనున్న ఎన్నికల్లో యువత పాత్ర కీలకంగా కావడంతో లోక్‌సభకు పోటీ చేస్తున్న అభ్యర్థుల అనుచరులు ఓటర్లను ఆకట్టుకోవడానికి వాయిస్‌మెయిల్స్, ఫోన్ కాల్స్, ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్‌ను ఉపయోగించుకుంటున్నారని చెప్పొచ్చు. కాగా, ఈవాయిస్ కాల్స్‌తో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

ఆర్థిక వ్యవస్థలో భారత్ అగ్రగామి

● ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ దామి
● నర్సంపేటలో జనసభ సమావేశం



ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ దామి

నర్సంపేట: ఆర్థిక వ్యవస్థలో భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ దామి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఎంఏఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నర్సంపేట జనసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్ రద్దు చేసి ముస్లిం ఆడబిడ్డల హక్కులు కాపాడి వారికి మనోధైర్యం కల్పించామన్నారు. దేశవ్యాప్తంగా రైల్వే ఆధునికీకరణ, వేల కిలో మీటర్ల నేషనల్ హైవే అభివృద్ధి, పేద మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు, రేషన్ బియ్యం పంపిణీ చేపట్టామన్నారు. ములుగు జిల్లాలో గిరిజన యూనివర్సిటీ నెలకొల్పి ఇక్కడి ప్రజలకు బాసటగా నిలిచిన మనసున్న ప్రధానమంత్రి మోదీ అన్నారు. రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు తీసుకువచ్చిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. విజన్–2040తో ముందుకు సాగుతున్న ప్రధానమంత్రి మోదీకి దేశ ప్రజలు బాసటగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. మరోసారి ప్రధానిగా మోదీ ఉంటేనే విభిన్న పథకాల అమలవుతాయన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్‌ను గెలిపించి మోదీకి బహుమతి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు, స్టేట్ స్పోక్ పర్సన్ గోగుల రాణిరుద్రమరెడ్డి, మానుకోట పార్లమెంట్ ప్రభారి నూకల వెంకట్‌నారాయణరెడ్డి, కన్వీనర్ ముసుకు శ్రీనివాస్‌రెడ్డి, పార్లమెంట్ వ్యవస్థ ప్రముఖ్ వల్లబు వెంకటేశ్వర్లు, పార్టీ వరంగల్, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, సిరికొండ బలరాం, యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, కే.వి.రంగా కిరణ్, వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్స్ రత్నం సతీష్‌షా, కుసుమ సతీష్‌బాబు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, పుల్లారావు యాదవ్, రాచకొండ కొంరయ్య, యాప సీతయ్య, రాజవర్ధన్‌రెడ్డి, జంపన సీతారామరాజు, కంభంపాటి పుల్లారావు, యువ నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, మహబూబాబాద్ పార్లమెంట్ కోకన్వీనర్లు కట్ల రామ్‌చందర్‌రెడ్డి, సింగారపు సతీష్, టి.దేవేందర్‌రావు, మహబూబాబాద్ విస్తారక్ ఎం.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుంది

● సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు
● రేపు ప్రధాని మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలి
● బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్



నియోజకవర్గ మేనిఫెస్టో సంకల్ప పత్రం విడుదల చేస్తున్న అరూరి రమేష్, నాయకులు

హన్మకొండ: కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందని, దీంతో ఆ పార్టీ నాయకులు అబద్ధాలు మాట్లాడుతున్నారని, సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారం చేస్తున్నారని బీజేపీ వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేష్ దుయ్యబట్టారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో నియోజకవర్గ మేనిఫెస్టో సంకల్పపత్రం విడుదల చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ నుంచి గట్టి పోటీ ఎదురవుతుండడంతో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆగమాగమవుతున్నారని, అవాక్కులు, చెవాక్కులు పేలుతున్నారన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తారంటూ రేవంత్, కడియం శ్రీహరి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, ప్రతిపక్షాలు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. అంబేడ్కర్ జీవించి ఉండి రాజ్యాంగం మార్చాలని చెప్పినా మార్చమని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టంగా చెబుతున్నా వీరి తీరు మారడం లేదని ధ్వజమెత్తారు. స్టేషన్ ఘనపూర్‌లో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయి ఇప్పుడు సిగ్గులేకుండా కడియం శ్రీహరి నీతులు మాట్లాడుతున్నాడని తూర్పారబట్టారు. ఇప్పుడున్న ఆస్తులు ఎక్కడివని ప్రశ్నించారు. తాను చదువుకున్న నాటినుంచి వ్యాపారం చేస్తూ అభివృద్ధి చెంది, రాజకీయాల్లోకి వచ్చానన్నారు. తాను గెలిస్తే నియోజకవర్గానికి ఏమీ చేస్తానో సంకల్ప పత్రం ద్వారా ప్రజలకు వివరించారు. ఈ నెల 8న(రేపు) వరంగల్‌లో జరిగే నరేంద్ర మోదీ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు డాక్టర్ టి.రాజేశ్వర్ రావు, నాయకులు వన్నాల శ్రీరాములు, మురళీధర్ గౌడ్, కొండేటి శ్రీధర్, రావు పద్మ, నిషిధగర్ రెడ్డి, కుమారస్వామి, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్, గజ్జెల శ్రీరాములు, అమరేందర్ రెడ్డి, లక్ష్మి పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

పాగాల సంపత్‌రెడ్డి మృతికి కడియం శ్రీహరే కారణం

● మాజీ ఎమ్మెల్యే రాజయ్య సంచలన వ్యాఖ్యలు

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు, చిల్పూరు జెడ్పీటీసీ పాగాల సంపత్‌రెడ్డి మృతికి స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరే కారణమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం శివునిపల్లిలో సోమవారం జరిగిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో రాజయ్య మాట్లాడుతూ కడియంపై పలు ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జెడ్పీ చైర్మన్‌గా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా సంపత్‌రెడ్డి ఎంతో కృషి చేశారని, బీఆర్ఎస్ విజయోత్సవ సభలో కడియం ఒక్కొక్కరికి బూత్‌ల వారీగా నాయకులను సభలో నిలబెట్టి మీ బూత్‌లో ఎన్ని ఓట్లు పోలయ్యాయి అంటూ అవమానపర్చారన్నారు. అదే క్రమంలో పాగాల సంపత్‌రెడ్డి గ్రామం రాజవరం గురించి మాట్లాడుతూ 'నువ్వు చిల్పూరు జెడ్పీటీసీగా, జెడ్పీ చైర్మన్‌గా ఉన్నావు, నీ గ్రామంలోనే ఓట్లు తక్కువ వచ్చాయి' అని అవమానకరంగా మాట్లాడాడన్నారు. సంపత్‌రెడ్డి మనోవేదనతో సాయంత్రం మృతిచెందాడని, ఆయన చావుకు ముమ్మాటికీ కడియం కారణమన్నారు. చివరకు జనగామలో నిర్వహించిన సంతాపసభలో సైతం సంపత్‌రెడ్డి గురించి కాకుండా ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని రాజకీయాలు మాట్లాడిన చరిత్ర కడియం శ్రీహరిది అన్నారు.

మార్కెట్ నిండా మక్కల రాశులే..



వరంగల్ : రైతులు విక్రయించేందుకు తీసుకువచ్చిన మొక్కజొన్నలతో సోమవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ నిండిపోయింది. అకాల వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో అన్నదాతలు సుమారు 6వేల మొక్కజొన్న బస్తాలు తీసుకువచ్చినట్లు మార్కెట్‌లోని అపరాల యార్డు సిబ్బంది తెలిపారు. మార్కెట్‌లో మక్కలకు బిల్టీ రకానికి రూ.2,250, ఈ–నామ్‌లో రూ.2,158 క్వింటాకు ధర పలికినట్లు సూపర్‌వైజర్ నర్సింగరావు పేర్కొన్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు మార్కెట్‌కు 55,473 క్వింటాళ్ల మొక్కజొన్నలు విక్రయానికి వచ్చినట్లు వివరించారు. మక్కలకు ఎంఎస్‌పీ ధర క్వింటాకు రూ.2,090 ఉందన్నారు.

పసుపు పంటకు రికార్డు ధర..

● క్వింటా రూ.16,368

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో పసుపు పంటకు రికార్డు ధర రూ.16,368 పలికింది. మార్కెట్‌లో ఇటీవల పసుపు సీజన్ ప్రారంభం కాగా, మొదట్లో గరిష్ఠ ధర రూ.12వేల నుంచి రూ.13వేల వరకు పలికింది. కాగా, సోమవారం మార్కెట్‌కు 50 బస్తాల పసుపు అమ్మకానికి రాగా, కాడిరకానికి క్వింటాకు గరిష్ట ధర రూ.16,368, కనిష్ట ధర రూ.9,963 పలికింది. గోళారకం పసుపు క్వింటాకు గరిష్ట ధర రూ.15,009, కనిష్ట ధర రూ.13,000 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

ఓటర్ల సౌలభ్యం కోసం 'చాట్ బాట్' యాప్

హన్మకొండ అర్బన్ : ఎన్నికలకు సంబంధించిన పలు వివరాలు తెలుసుకునేందుకు ఓటర్ల సౌలభ్యం కోసం వాట్సాప్‌కు సంబంధించిన 'చాట్ బాట్' యాప్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. దీనిని ఉపయోగించేందుకు క్యూఆర్ కోడ్ లేదా 97045 60805 నంబర్‌ను సంప్రదించాలన్నారు. తద్వారా ఓటర్ హెల్ప్‌లైన్‌తో పాటు ఎన్నికలకు సంబంధించిన వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. ఈ యాప్‌లో మొదట హాయ్ అని సందేశం పంపించాలని, అలా సందేశం పంపిన వెంటనే వాట్సాప్‌లో ఓటర్ హెల్ప్‌లైన్, పీడబ్ల్యూడీ హెల్ప్‌లైన్, పోలింగ్ బూత్ వివరాలు అనే మూడు ఆప్షన్లు కనిపిస్తాయన్నారు. పీడబ్ల్యూడీ హెల్ప్‌లైన్‌లో గూగుల్ లింక్‌ను ఉపయోగించి వీడియో కాల్ చేయడం ద్వారా ఎలక్షన్ కంట్రోల్ రూమ్‌లోని అధికారులతో నేరుగా రోజు (ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు) మాట్లాడే అవకాశం ఉంటుందని, బధిరుల కోసం కంట్రోల్ రూమ్‌లో సైన్ లాంగ్వేజ్ ద్వారా కూడా సమాచారం తెలిపేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారని వివరించారు. అలాగే ఎన్నికలకు సంబంధించిన సందేశాలు, ఆకర్షణీయమైన ఫొటోలు voter-spointh-nk.in అనే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయవచ్చని పేర్కొన్నారు. ఓటర్ల సౌలభ్యం కోసం వరంగల్ ఎన్ఐటీ విద్యార్థులు, అధ్యాపక బృందం రూపొందించిన ఈ యాప్‌ను ఓటర్లు సద్వినియోంచుకోవాలని కోరారు.

చిత్రకళలో సుధాకర్‌కు రజతం

నయీంనగర్ : రంగ్–2023 సంవత్సరానికి సంబంధించి 2వ జాతీయ స్థాయి ఆర్ట్–పెర్ఫామెన్స్ కాంపిటీషన్‌లో హనుమకొండ తేజస్వి ఉన్నత పాఠశాల చిత్రకళా బోధకుడు పానుగంటి సుధాకర్ రజత పథకం సాధించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ ఆధ్వర్యంలో గత ఫిబ్రవరి 10, 11 తేదీల్లో ముంబాయిలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ చిత్రకళ పోటీలు నిర్వహించారు. '75 సంవత్సరాల స్వాతంత్య్ర భారతదేశం' అనే అంశంపై చిత్రాన్ని పోస్ట్ ద్వారా కాంపిటీషన్‌కు పంపగా 40 నుంచి 60 ఏండ్ల కేటగిరీలో సుధాకర్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. నిర్వాహకులు రజత పతకం, ప్రశంసా పత్రాన్ని పంపించారు. సోమవారం తేజస్వి విద్యా సంస్థల చైర్మన్ రేవూరి జన్నారెడ్డి రజత పతకం, ప్రశంస పత్రం అందజేసి సుధాకర్‌ను అభినందించారు. ప్రిన్సిపాల్ సంధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సుధాకర్‌ను అభినందిస్తున్న జన్నారెడ్డి

నగరాభివృద్ధిని అడ్డుకున్నది గత ప్రభుత్వాలే..



మాట్లాడుతున్న బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్

● కాంగ్రెస్, బీజేపీలకు ఓటు అడిగే హక్కు లేదు
● మీట్ ది ప్రెస్‌లో బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్

నయీంనగర్ : పదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిందని బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. సోమవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు వరంగల్ నగరాన్ని ధ్వంసం చేశాయని, కొత్త పరిశ్రమలు కేటాయించక పోగా, గతంలో ఉన్న అజంజాహి మిల్లు, తోలుపరిశ్రమ, ఎయిర్ పోర్టు నామరూపాల్లేకుండా చేశాయని విమర్శించారు. 1930లోనే మూడు వేల ఎకరాలతో వరంగల్‌లో అతిపెద్ద విమానాశ్రయం ఉండేదని.. కుట్రపూరితంగానే రెండు జాతీయ పార్టీలు దానిని పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు వరంగల్‌లో ఓటు అడిగే హక్కు లేదని, గుజరాత్ మోడల్ అంటే ప్రజలను, బ్యాంకులను దోచుకునే డెకాయిట్‌లకు రాష్ట్రాన్ని అప్పగించడమా అని సుధీర్‌కుమార్ ప్రశ్నించారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటును అడ్డుకున్న బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు, సింగరేణిని ప్రైవేటీకరణ చేసి పెట్టుబడిదారుల చేతుల్లో తెలంగాణను పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీ అభ్యర్థులు బీఆర్ఎస్ పార్టీ నుంచి వెళ్లిన వారేనని, వారి ఓటు బ్యాంకు తనకు కలిసి వస్తోందన్నారు. తాను 20ఏళ్లుగా బీఆర్ఎస్‌లో కార్యకర్తగా పనిచేశానని, మూడు సార్లు ప్రజాప్రతినిధిగా పనిచేసినా ఎక్కడా చిల్లిగవ్వ అవినీతికి ఆస్కారం ఇవ్వలేదన్నారు. తల్లిలాంటి పార్టీని మోసం చేసిన కడియం శ్రీహరి, అరూరి రమేష్‌కు వరంగల్ ప్రజలు ఓటుతో గుణపాఠం చెబుతారన్నారు. దేశంలో తప్పకుండా మార్పు రావాల్సిన అవసరం ఉందని, రాబోయేది సంకీర్ణ ప్రభుత్వమేనని ఆయన పేర్కొన్నారు. ప్రాంతీయ పార్టీల మద్దతుతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని జోస్యం చెప్పారు. వరంగల్ పార్లమెంట్ గడ్డపై విజయకేతనంతో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని తన గెలుపుపై ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, జర్నలిస్టు సంఘాల నాయకులు బీఆర్ లెనిన్, గాడిపల్లి మధు, ప్రెస్‌క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల స్థానానికి 13మంది నామినేషన్లు దాఖలు

నల్లగొండ: ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి సోమవారం ఐదవ రోజు 13 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేష్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ నుంచి ముండ్ర మల్లికార్జున రావు, ధర్మ సమాజ్ పార్టీ నుంచి బరిగల దుర్గాప్రసాద్, నేషనల్ నవక్రాంతి పార్టీ నుంచి కర్ని రవి, స్వతంత్ర అభ్యర్థులుగా పులిపాక సుజాత, చీదల్ల వెంకట సాంబశివరావు, చీదల్ల ఉమామహేశ్వరి, తాడిశెట్టి క్రాంతి కుమార్, అయితగోని రాఘవేంద్ర, బక్క జడ్సన్, బుగ్గ శ్రీకాంత్, పాలకూరి అశోక్ కుమార్, దేశగాని సాంబశివరావు నామినేషన్లు వేశారు. వీరంతా తమ నామినేషన్ పత్రాలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సీహెచ్. మహేందర్‌కు అందజేశారు.

సాక్షి ఫ్యామిలీ
వరంగల్
మంగళవారం ॥ 7-5-2024



• కన్యాకుమారిలో సృష్టి బక్షి పాదయాత్ర మొదలుపెట్టినప్పటి చిత్రం

డాక్యుమెంటరీ



• తమిళనాడులోని ఒక బామ్మతో మాట్లాడుతూ...

కలిసి నడిచే గొంతులు

కన్యాకుమారి నుంచి
శ్రీ నగర్ వరకూ
260 రోజుల పాటు
3,800 కిలోమీటర్లు
దేశమంతా నడిచింది
సృష్టి బక్షి.
ఎందుకు?
స్త్రీలపై జరిగే దురాగతాలపై
చైతన్యం కలిగించడానికే కాదు
స్త్రీల శక్తియుక్తులను వారికి గుర్తు చేయడానికి.
ఆ సుదీర్ఘ ప్రయాణం ఇప్పుడు
'విమెన్ ఆఫ్ మై బిలియన్' పేరుతో
అమెజాన్‌లో స్ట్రీమ్ అవుతోంది.
నటి ప్రియాంకా చోప్రా నిర్మాత.

తాను నడిచి చేరుకున్న ఊరిలో ఏదైనా స్కూల్‌లోగాని, పబ్లిక్ హాల్‌లో కాని మహిళలను పోగు చేస్తుంది సృష్టి బక్షి. 'అందరూ కళ్లు మూసుకుని దీర్ఘంగా శ్వాస పీల్చి వదలండి' అంటుంది. 'ఇప్పుడు మీ కళ్ల ఎదురుగా మీ 11 ఏళ్ల వయసున్న మీ రూపాన్ని గుర్తు చేసుకోండి. ఆ 11 ఏళ్ల అమ్మాయిలో ఉండే విశ్వాసం, ఆనందం ఎన్ని విధాలుగా ధ్వంసమైందో గుర్తుకు తెచ్చుకోండి. ఆ అమ్మాయికి సారీ చెప్పండి. ఎందుకంటే ఆ విధ్వంసమంతా మీ అనుమతితోనే జరిగింది' అంటుంది. చాలామంది ఆ మాటలకు ఏడుస్తారు. గడిచివచ్చిన జీవితాన్ని తలుచుకుని బాధలో మునిగిపోతారు. అప్పుడు సృష్టి బక్షి ఒక బోర్డు మీద స్త్రీ శరీర నిర్మాణం గీచి 'ఇదిగో ఈ అవయవాల రీత్యా మీరు మగవారి కంటే భిన్నంగా పుట్టారు. ప్రకృతి ఈ అవయవాలను మీకు ఇస్తే సమాజం అదుపు, ఆంక్షలు, వివక్ష, కుటుంబ హింస, ఆర్థిక బానిసత్వం, ఇంటి పని... ఇన్ని ఇచ్చింది. మనం ఎందుకు మగవారితో సమానం కాము?' అని ప్రశ్నిస్తుంది.

మార్పు కోసం

సృష్టి బక్షిది ముంబై. ఆమె హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో చదువుకుంది. హాంగ్‌కాంగ్‌లో మార్కెటింగ్‌లో పెద్ద సంస్థల్లో పని చేసింది. తండ్రి ఆర్మీలో పని చేయడం వల్ల ఆమెకు దేశం పట్ల ఒక ఉద్వేగం ఉండేది. అయితే తాను ప్రేమించే దేశంలో స్త్రీలపై జరిగే అన్యాయాలను చూసి చలించి పోయేది. '2017లో హాంకాంగ్‌లో సిటీ బస్ ఎక్కి ఇంటికి వెళుతున్నప్పుడు నా ఫోన్‌లో ఇండియాలో తల్లీ కూతుళ్లపై తండ్రి ఎదుటే అత్యాచారం చేసి చంపేశారన్న వార్త చదివాను. చాలా నిస్పృహ కలిగింది. నాలాంటి వాళ్లు సౌకర్యంగా పడక్కుర్చీలో కూచుని చింతించడం సరికాదని రంగంలో దిగాలని అనుకున్నాను. అలా నా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, ఇండియా వచ్చి దేశంలోని స్త్రీలందరితో మాట్లాడాలని 2018 మే నెలలో పాదయాత్ర ప్రారంభించాను' అని చెప్పింది సృష్టి.

రోజూ వేలాది మంది

'ఉమెన్ ఆఫ్ మై బిలియన్' పేరుతో సృష్టి బక్షి మే 2018లో కన్యాకుమారి నుంచి పాదయాత్ర ప్రారంభించింది. ఈ యాత్ర రికార్డు అయ్యేలా టీమ్‌ను ఏర్పాటు చేసుకుంది. 260 రోజుల పాటు దాదాపు 4 వేల కిలోమీటర్ల పాటు సాగే ఈ యాత్రకు కోటి రూపాయలు ఖర్చవుతాయి. 50 లక్షలను క్రౌడ్ ఫండింగ్ ద్వారా పోగు చేసింది.

'ఈ యాత్రలో స్త్రీల కలలు, ఆకాంక్షలు, వారి హక్కులు, సంఘర్షణలు. విజయాలు వినదలుచుకున్నాను. వారు ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో తెలుసుకోవాలనుకున్నాను. నా సుదీర్ఘ యాత్రలో మన దేశంలో వరకట్నం ఇంకా పెద్ద సమస్యగా ఉందని అర్థమైంది. వరకట్నం స్త్రీలను మానసికంగా పురుషులతో సమానం అనుకోనివ్వడం లేదు. స్త్రీలను అసభ్యంగా తాకడం, హింసించడం, అణిచి పెట్టడం కొనసాగుతూనే ఉంది. ఒక దశలో నేను యాత్ర చేయలేననుకున్నాను. కాని ఆ మరుసటి రోజు నా మీటింగ్‌కు హాజరైన ఒక ఆశా వర్కర్– ''రాత్రి నన్ను నా భర్త కొట్టాడు. నీ మాటలు విన్నాక ఇక ఇలాంటిది జరగనివ్వకూడదని నిశ్చయించుకున్నాను. నేను నా భర్తను నిలువరించడానికి నలుగురి సాయం తీసుకుంటాను'' అని చెప్పింది. నా యాత్ర వల్ల జరుగుతున్న మేలు అర్థమయ్యాక కొనసాగాను' అని తెలిపింది సృష్టి.

డాక్యుమెంటరీ విడుదల

సృష్టి చేసిన యాత్ర అంతా 'విమెన్ ఆఫ్ మై బిలియన్' పేరుతో డాక్యుమెంటరీగా రూపొందింది. మే 3 నుంచి అమెజాన్‌లో స్ట్రీమ్ అవుతోంది. ఈ డాక్యుమెంటరీ మీద మంచి రివ్యూలు వస్తున్నాయి. 'ఎందరో స్త్రీలు. వారి జీవితానుభవాలను ఈ డాక్యుమెంటరీలో పంచుకున్నారు. వారు సమస్యలు వారి తెచ్చుకున్నవి కాదు. వారికి తెచ్చిపెట్టినవి. అందుకే నటి ప్రియాంకా చోప్రా నా డాక్యుమెంటరీని చూసి తాను నిర్మాతగా మారి విడుదల చేయడానికి ముందుకు వచ్చారు. ఒక స్త్రీగా, ఆడపిల్ల తల్లిగా ఆమెకు స్త్రీల సాధికారత, ఆత్మగౌరవం గురించి అక్కర ఉంది. జెండర్ ఈక్వాలిటీ గురించి స్త్రీ, పురుషుల్లో చైతన్యం రావడానికి ఈ డాక్యుమెంటరీ ఉపయోగపడుతుందని ఆమె విశ్వసిస్తున్నారు' అని తెలిపింది సృష్టి బక్షి.

కళను రాశి పోస్తోంది!



ఒక శావు పేపర్ తయారు కావాలంటే పది లీటర్ల నీళ్లు కావాల్సి వస్తుంది. రాసుకోవడానికి ఒక రీము పేపర్ సిద్ధం అవ్వాలంటే పాతికేళ్లు పెరిగిన చెట్టు కొమ్మలను సమూలంగా నరకాలి. చెట్టును నరక్కుండా, నీటిని వృథా చేయకుండా ఒక డైరీ తయారయితే? అంతకంటే ఇంకేం కావాలి? ఇంతే కాదు, టెక్స్‌టైల్ ఇండస్ట్రీ వృథాను హరాయించుకోవడానికి భూమాత పడే యాతన కూడా తగ్గిపోతుంది. ఇలాంటి వినూత్న ప్రయత్నానికి తెర తీసింది సూరత్‌లో ఓ ఆర్కిటెక్ట్. స్టేషనరీ వస్తువులు, ఇంటీరియర్ డెకరేషన్‌ని కలగలుపుతూ చేసిన ప్రయోగమే రుహానీ రంగ్. ఆ ప్రయోగం వెనుక దాగిన నేపథ్యాన్ని వివరించింది రాశి అగర్వాల్. ఆమె మదిలో వెలిగిన ఈ ఆలోచన తొమ్మిది వేల కిలోల పత్తికి పుస్తక రూపాన్నిచ్చింది.



• రాశి అగర్వాల్



మనదేశంలో కళ ఉంది!

''నేను ఆర్కిటెక్చర్ ఫైనలియర్‌లో ఉన్నప్పుడు మన సంప్రదాయ నిర్మాణాలు, కళలు, చేతివృత్తుల అధ్యయనం కోసం విస్తృతంగా పర్యటించాను. ఢిల్లీ నుంచి జైపూర్, అహ్మదాబాద్, కచ్, పాండిచ్చేరి నుంచి పూనా వరకు పరిశీలిస్తే మనదేశంలో రకరకాల కళలు, కళా నైపుణ్యాలున్న పని వాళ్లున్నారని తెలిసింది. వాళ్ల చేతుల్లో ఉన్న ప్రతిభను ప్రదర్శించే వేదికలు తగినంతగా లేవు. అలాంటి ఒక వేదికను ఏర్పాటు చేసి, నా వృత్తిలో ఇంటీరియర్ డిజైనింగ్‌కు దోహదం చేసే విధంగా ఒక ప్రయోగం చేశాను. అది విజయవంతమైంది. రకరకాల కళలను ఒక వేదిక మీదకు తీసుకురావాలనే ఉద్దేశంతో 'రుహానీ రంగ్' పేరుతో ఆర్ట్ స్టార్టప్ మొదలు పెట్టాను. ప్లానర్ బుక్ కవర్ పేజీ మీద మధుబని ఆర్ట్ ఉంటే ఇంట్లో అందమైన షో పీస్ ఉన్నట్లే. ప్లానర్ బుక్‌ని కార్నర్ స్టాండ్‌లో అందంగా అమరిస్తే డ్రాయింగ్ రూమ్ కళాత్మకంగా ఉంటుంది. ఇలాంటి ఎన్నో హస్త కళలను పునరుద్ధరించగలుగుతున్నాను.

రుహానీ రంగ్‌ను ఐదు వేల రూపాయలతో మొదలు పెట్టాను. నాతో కలిసి 50 మంది కళాకారులు, 40 మంది ఇతర ఉద్యోగులు పని చేస్తున్నారు. వస్త్రాలను తయారు చేసే భారీ పరిశ్రమలకు పెద్ద సంఖ్యలో పత్తి బేళ్లు వస్తుంటాయి. ప్రతి బేలులోనూ మెషీన్‌లో అమరికకు తగినట్లు ఉపయోగించగా మిగిలిన పత్తి వృథా అవుతూ ఉంటుంది. అది భూమిలో కలిసి పోవాల్సిందే తప్ప మరో పనికి ఉపయోగించేవారు కాదు. ఎందుకూ పనికి రాదని వదిలేస్తున్న ఆ పత్తే నా కుటీర పరిశ్రమకు ముడిసరుకు. నాకు కోవిడ్ సమయం కూడా మంచే చేసింది. ఆ టైమ్‌లో పెద్ద చిన్న పరిశ్రమలన్నీ మూత పడ్డాయి. హస్తకళాకారులు పని లేక ఆర్థికంగా మానసికంగా దెబ్బతిని ఉన్నారు. ఆ సమయంలో నేను ఒక్కొక్కరిని కలిసి నా ఆలోచన చెప్తుంటే వాళ్లు ఉత్సాహంగా నాకు మరికొన్ని ఐడియాలు చెప్తూ తమ అనుభవాన్ని జోడించారు. అలా 2020లో మొదలు పెట్టిన నా కుటీర పరిశ్రమ ఇంత వరకు హ్యాండ్ మేడ్ పేపర్‌తో ప్లానర్స్, క్యాలెండర్‌లు, నోట్‌బుక్స్, జర్నల్స్, స్కెచ్ బుక్స్ వంటి 15 వేల ఉత్పత్తులకు రూపమిచ్చింది. వాటిని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే నలభై వేల ఫాలోవర్స్‌ను తెచ్చి పెట్టింది. ఆర్ట్ పీస్ కేవలం కళాభిరుచి, కళారాధన కోసమే కాదు. అది మన దైనందిన జీవితంలో భాగంగా మారాలి. అప్పుడే కళ ఎప్పటికీ నిలిచి ఉంటుంది'' అని వివరించింది రాశి అగర్వాల్.

సన్ బర్న్ ముప్పు!



- పండ్ల తోటలు, కూరగాయ తోటలకు ముప్పుగా మారిన ప్రచండమైన ఎండ
- అధిక ఉష్ణోగ్రతలతో పాటు తార స్థాయికి చేరిన లైట్ ఇంటెన్సిటీ, యు.వి. రేడియేషన్
- మామిడి, జామ కాయలు పక్వానికి రాక ముందే ఎర్రగా మారి రాలిపోవటం లేదా నాణ్యత కోల్పోతున్నాయని వాపోతున్న రైతులు
- రోజూ సాయంత్రం నీటిని, వారానికోసారి పోషకాలను చల్లమంటున్న 'ఆంగ్రూ' మాజీ డీన్ డా. పి.వి. రావు

ఈ వేసవిలో ఎల్‌నినో పుణ్యాన సాధారణం కన్నా ఐదారు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ ఉద్యాన తోటలు సాగు చేసే రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ముఖ్యంగా సీజనల్ పండ్ల తోటలైన మామిడి, జామతో పాటు కూరగాయలు, డ్రాగన్ వంటి తోటలకు నిప్పుల కుంపటి వంటి వేడి ఒత్తిడి తీవ్ర సమస్యగా మారింది.

47 డిగ్రీలకు చేరిన పగటి గరిష్ఠ ఉష్ణోగ్రత వల్ల భూమి విపరీతంగా వేడెక్కి రాత్రి 7–8 గంటల వరకు శగలు కక్కుతూ ఉంది. దీన్నే 'రిఫ్లెక్టెడ్ రేడియేషన్' అంటారు. పొలాల్లో కన్నా కాంక్రీటు అరణ్యాలుగా మారిన నగరాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. చెట్లు, మొక్కలు వేర్ల ద్వారా తీసుకునే నీటి కన్నా ఎక్కువగా నీరు ఆవిరైపోతుండటం వల్ల లేత ఆకుల చివర్లు ఎండిపోతున్నాయి. లేత కణాలు ఉంటాయి కాబట్టి లేత ఆకుల చివరలు మాడిపోతున్నాయి.

పగటి గరిష్ఠ ఉష్ణోగ్రత 25 నుంచి 35 డిగ్రీల సెల్షియస్ వరకు ఉన్న వాతావరణం పంటల పెరుగుదలకు అనుకూలంగా ఉంటుంది. 40 డిగ్రీలు దాటిన తర్వాత పంటలు, తోటలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇప్పుడు 47–48 డిగ్రీల సెల్షియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉండటంతో కూరగాయ పంటలు, పండ్ల తోటలు సన్ బర్న్‌తో సతమతమవుతూ ఉన్నాయని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం మాజీ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ పీవీ రావు 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.

సాధారణంగా ఎండను రక్షణకు కొన్ని పంటలపై 50% సూర్యరశ్మిని ఆపే గ్రీన్ షేడ్‌నెట్‌ను వాడుతుంటారు. అయితే, ఉష్ణోగ్రతలు బాగా పెరిగిపోవటం వల్ల 80% ఎండను ఆపే గ్రీన్ షేడ్‌నెట్‌లు వేసుకోవాల్సి వస్తోందని డా. పివి రావు అన్నారు.



• సన్‌బర్న్‌కు గురైన మామిడి కాయ



• సన్‌బర్న్‌కు గురైన జామ కాయ



• సన్‌బర్న్‌కు గురైన డ్రాగన్ పంట

సూర్యకాంతి తీవ్రత

పంటలపై ప్రతికూల ప్రభావం ఎంతగా ఉందన్నది ఉష్ణోగ్రతతో పాటు సూర్యకాంతి తీవ్రత (లైట్ ఇంటెన్సిటీ)పై కూడా ఆధారపడి ఉంటుందని డా. రావు వివరించారు. సాధారణ ఉష్ణోగ్రతలు ఉన్న రోజుల్లో చదరపు మీటరుకు 20,000 – 25,000 కిలో లక్స్ వరకు సూర్యకాంతి ఉంటుంది. వేసవిలో సాధారణంగా ఇది 80,000 కిలో లక్స్‌కు పెరుగుతూ ఉంటుంది. అయితే, ఈ ఏడాది ఇది విపరీతంగా పెరిగి, ఏకంగా 1,20,000 కిలో లక్స్‌కు చేరటం పండ్ల తోటలకు, కూరగాయల పంటలకు ముప్పుగా మారిందని డాక్టర్ పి వి రావు తెలిపారు.

ఫొటో ఆక్సిడేషన్ వల్ల ఆకులలో కిరణజన్య సంయోగ క్రియ సజావుగా జరగటం లేదు. లేత ఆకుల్లో క్లోరోఫిల్ మాలిక్యూల్ చిట్లిపోవటం వల్ల ఆకుపచ్చగా ఉండాల్సిన ఆకులు జీవం కోల్పోయి పసుపు రంగుకు మారి ఎండిపోతున్నాయన్నారు.

తారస్థాయికి చేరిన యువి రేడియేషన్

అతినీలలోహిత కిరణాల (యువి) రేడియేషన్ సూచిక సాధారణంగా 3–4 వరకు ఉంటుంది. వేసవిలో ఈ సూచిక 8–9 వరకు పెరుగుతుంది. అయితే, ఈ ఏడాది మాత్రం ఇది 12కు పెరగటంతో సూర్యరశ్మిని పంటలు, తోటలు తట్టుకోలేకుండా ఉన్నాయని డా. పి వి రావు వివరించారు. మామిడి, జామ తదితర కాయలు ఎండ పడిన చోట ఎర్రగా మారి దెబ్బతింటున్నాయి. వెనుక వైపు పచ్చిగానే ఉంటూ ఎండ సోకిన దగ్గర రంగు మారుతుండటంతో పండ్లు నాణ్యతను కోల్పోతున్నాయి. అల్ఫాన్సో, పచ్చడి రకాల మామిడి కాయలు బాగా రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.



సాగుబడి
కృత్తిక కార్తె : మే 11 నుంచి

పోషకాలు, హార్మోన్ అసమతుల్యత

వేసవిలో టొమాటో, మిర్చి వంటి కూరగాయ పంటల మొక్కలు నాటుకునేటప్పుడు వీటికి ఉత్తర, దక్షిణ వైపున నీడనిచ్చే మొక్కలను వేసుకుంటే ఎండ బారి నుంచి కొంత మేరకు కాపాడుకోవచ్చు. ఉదాహరణకు.. టొమాటో మొక్కలు ఉత్తర దక్షిణాల్లో మొక్కజొన్న లేదా ఆముదం మొక్కలు వత్తుకోవాలి. వడగాలుల నుంచి పంటలను రక్షించుకోవటానికి పొలం సరిహద్దుల్లో విండ్ బ్రేకర్‌గా పనికొచ్చే ఎత్తయిన చెట్లు పెంచుకోవాలి. ఈ ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్న వారి తోటలు ఉపశమనం పొందుతాయి.

దాదాపు మరో నెల రోజులు మండే ఎండలు కొనసాగే పరిస్థితి ఉండటంతో తోటలకు చాలినంతగా నీటి తడులు ఇవ్వటంతో పాటు, చెట్లపైన కూడా సాయంత్రం 3 గంటల తర్వాత నీటిని పిచికారీ చేయాలి. వాతావరణంలో వేడి పెరిగే కొద్దీ నేల నుంచి వేర్ల ద్వారా పోషకాలను తీసుకునే సామర్థ్యం తగ్గుతుందని, అందుకు తగినట్లు నీరు, పోషకాలు సైతం అందిస్తే తోటలకు ఉపశమనం కలుగుతుందని డాక్టర్ పివి రావు సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల కాలంలో పంటలు పోషకాలను నేల నుంచి తీసుకోవటంలో ఇబ్బంది వస్తుంది. జింక్ లోపం ఏర్పడుతుంది. హార్మోన్లను కూడా చెట్లు, మొక్కలు తయారు చేసుకోలేవు. హార్మోన్ అసమతుల్యత ఏర్పడుతుంది.

ఎండ తీవ్రతకు రెస్పిరేషన్ రేటు ఎక్కువ అవటం వల్ల కిరణజన్య సంయోగ క్రియ ద్వారా తయారయ్యే పిండి పదార్థం మొక్క/చెట్టు నిర్వహణకే సరిపోతాయి. పెరుగుదల లోపిస్తుంది. అదనపు పిండిపదార్థం అందుబాటులో వుండక పూలకు, కాయలకు పోషకాలను అందించలేని సంక్షోభ స్థితి నెలకొంటుంది. అందువల్ల పూలు, కాయలు రాలిపోయే పరిస్థితి ఎదురవుతుంది.

అతి వేడి వత్తిడి ఎదుర్కొంటున్న మామిడి తోటలపై జింక్, ప్లానోఫిక్స్, బోరాన్‌లను సాయంత్రం 3 గంటల తర్వాత పిచికారీ చేయాలి. టొమాటో, మిరప, వంగ తదితర కూరగాయ మొక్కలపైన నాఫ్తలిన్ అసిటిక్ యాసిడ్‌ను 5 లీటర్ల నీటికి 1.5 నుంచి 2 ఎం.ఎల్. మోతాదులో కలిపి పిచికారీ చేయాలని డా. రావు తెలిపారు.



• టొమాటో పంటకు షేడ్‌నెట్

నీరు, పోషకాలు పిచికారీ చేయాలి



విపరీత ఉష్ణోగ్రతలకు తోడైన వడగాడ్పులకు కూరగాయ తోటలు, పండ్ల తోటల్లో లేత ఆకులు మాడిపోతున్నాయి. ఉష్ణోగ్రత, అతినీలలోహిత వికిరణాలతో పాటు సూర్యరశ్మి తీవ్రత చాలా పెరిగిపోయింది. ప్రతి రోజూ సాయంత్రం 3 గంటల తర్వాత నీటిని పిచికారీ చేయటం ద్వారా పంటలకు రక్షించుకోవచ్చు. వారం, పది రోజులకోసారి ఇంటిపంటలపై నానో యూరియా/వర్మీవాష్/జీవామృతం/ఆవు మూత్రంను ఒకటికి పది (1:10) పాళ్లలో నీటిలో కలిపి పిచికారీ చేసుకొని, అతి వేడి వత్తిడి నుంచి తోటలకు ఉపశమనం కలిగించాలి.

- డాక్టర్ పి.వి. రావు (94901 92672), రిటైర్డ్ డీన్ ఆఫ్ అగ్రికల్చర్, ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ అధ్యక్షులు, హైదరాబాద్

యు.వి. రేడియేషన్ పండ్లను దెబ్బతీస్తోంది!

అతి నీలలోహిత వికిరణాల (యు.వి. రేడియేషన్) తీవ్రత బాగా పెరిగిపోయి మామిడి, జామ పండ్లు ఎండదెబ్బకు గురవుతున్నాయి. యు.వి. రేడియేషన్ ఏప్రిల్ ఆఖరి, మే మొదటి వారాల్లో తీవ్రస్థాయికి చేరింది. యు.వి. ఇండెక్స్ ఇప్పుడు 12–13కి పెరిగిపోయింది. మామిడి, జామ వంటి పండ్ల తోటల్లో కాయలపై ఎండ మచ్చలు ఏర్పడుతూ పండ్ల నాణ్యతను తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. టొమాటోలు వంటి కూరగాయలపై కూడా ఈ ఎండ మచ్చలు సమస్యగా మారాయి. ఎండ తగిలిన వైపు పండినట్లు రంగు మారుతుంది. వెనుకవైపు పచ్చిగానే ఉంటుంది. నాణ్యత కోల్పోయిన ఈ కాయలను కొయ్యలేక, చెట్లకు ఉంచలేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధిక వేడికి అనేక పోషకాలు అందక కొన్ని కాయలు రాలిపోతున్నాయి. యు.వి. రేడియేషన్ ఉద్యాన తోటల రైతులను ఈ ఏడాది చాలా నష్టపరుస్తోంది. నత్రజని కోసం ఫిష్ అమినో యాసిడ్ లేదా పంచగవ్యలను ద్రవజీవామృతంతో కలిపి చల్లాలి. బోరాన్ కోసం జిల్లేడు+ఉమ్మెత్త కషాయం, పొటాష్ కోసం అరటి పండ్ల (తొక్కలతో కలిపి తయారు చేసిన) కషాయాన్ని పిచికారీ చేయాలి.

- ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు (76598 55588), తెలంగాణా గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం

అల్ఫాన్సో, పచ్చడి కాయలు 80% రాలిపోతున్నాయి



ఈ ఏడాది ఉష్ణోగ్రతలు చాలా ఎక్కువగా ఉండటం వల్ల అల్ఫాన్సో, దేశీ పచ్చడి రకాల చిన్న కాయలు రాలిపోతున్నాయి. ఆర్గానిక్ మామిడి తోటల్లో గతంలో 10–20% రాలే కాయలు ఈ సీజన్‌లో 70–80% రాలిపోతున్నాయి. ఇతర రకాల్లో కూడా జనవరిలో వచ్చిన ఆఖరి పూత ద్వారా వచ్చిన చిన్న కాయలు ఎక్కువగా ఎండదెబ్బకు రాలిపోతున్నాయి. ఎండలు ముదిరే నాటికి నిమ్మకాయ సైజు ఉన్న కాయలకు ప్రాబ్లం లేదు. సన్‌బర్న్ సమస్య వల్ల కాయలు ఒకవైపు అకాలంగా రంగు మారిపోతుంటే, వెనుక వైపు మాత్రం పచ్చిగానే ఉంటున్నాయి. బంగినపల్లి పూత రాలిపోవటంతో ఈ ఏడాది 20% కూడా కాయ మిగల్లేదు. దశేరి కాపు మాత్రం అన్నిచోట్లా బాగుంది. మామిడి చెట్లకు రోజూ నీరు స్ప్రే చేస్తున్నాం. చెట్ల కింద మల్చింగ్ చేసి నీటి తేమ ఆరిపోకుండా కాపాడుకుంటున్నాం. ఇదిలా ఉంటే, మధ్యప్రాచ్య దేశాల్లో యుద్ధం వల్ల నౌకల్లో వెళ్లే సరుకు విమానాల ద్వారా ఎగుమతి అవుతోంది. దీనికితోడు, దుబాయ్‌లో భారీ వరదల వల్ల అమెరికా తదితర దేశాలకు మామిడి పండ్ల ఎగుమతి ఈ ఏడాది బాగా దెబ్బతింది. గత 15 రోజుల్లో 350 ఎమిరేట్స్ విమానాలు రద్దయ్యాయి. దీంతో ఖతర్ తదితర దేశాల విమానాలు ధరలు పెంచేశాయి. అమెరికాకు కిలో మామిడి రవాణా చార్జీ రూ. 180 నుంచి 600కు పెరిగిపోయింది. అమెరికాలో 4 కిలోల మామిడి పండ్ల బాక్స్ గతంలో 40 డాలర్లకు అమ్మేవాళం. ఇప్పుడు 60–70 డాలర్లకు అమ్మాల్సివస్తోంది. దీంతో అమెరికాకు మామిడి ఎగుమతులు బాగా తగ్గిపోయాయి.

- రఫీ (98480 02221), సేంద్రియ మామిడి రైతు, ఎగుమతిదారు, ఏఆర్4మ్యాంగోస్, హైదరాబాద్

సేంద్రియ సేద్యం, వ్యాపార నైపుణ్యాలపై 6 రోజుల శిక్షణా శిబిరం

తెలుగు రాష్ట్రాలకు చెందిన ఔత్సాహికులను సేంద్రియ వ్యవసాయంలో మెళకువలు నేర్పటంతో పాటు.. సేంద్రియ ఆహారోత్పత్తుల వ్యాపార అవకాశాలను సృష్టించటంలో నిపుణులైన ఫెసిలిటేటర్‌గా మారడానికి నైపుణ్యం, విజ్ఞానాభివృద్ధి శిక్షణా కోర్సును నిర్వహించనుంది కృష్ణ సుధా అకాడమీ ఫర్ అగ్రోఎకాలజీ. 20 ఏళ్లుగా సేంద్రియ వ్యవసాయ శిక్షణలో విశేష కృషి చేస్తున్న సుస్థిర వ్యవసాయ కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జీవీ రామాంజనేయులు సారథ్యంలో నూజివీడుకు సమీపంలోని కొండపర్వలో సకల వసతులతో కృష్ణ సుధా అకాడమీ ఫర్ అగ్రోఎకాలజీ అంతర్జాతీయ స్థాయి వసతులతో ఇటీవలే ప్రారంభమైంది. సేంద్రియ వ్యవసాయంలో క్షేత్రస్థాయిలో లోతైన పరిశోధనలు చేయటంతో పాటు సేంద్రియ వ్యవసాయం, వ్యాపారం తదితర అంశాలపై ప్రామాణికమైన శిక్షణ ఇవ్వటమే ఈ అకాడమీ లక్ష్యంగా పెట్టుకుంది. అగ్రికల్చర్ స్కిల్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా తదితర సంస్థల తోడ్పాటుతో మే 22 నుంచి 27 వరకు తెలుగులో నిర్వహించనున్న ఉచిత రెసిడెన్షియల్ శిక్షణా శిబిరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డా. రామాంజనేయులు తెలిపారు. గుగుల్ ఫామ్ ద్వారా అభ్యర్థులు విధిగా ముందుగా పేర్లు నమోదు చేసుకోవటం తప్పనిసరి. 30–35 మందికి మాత్రమే అవకాశం.
ఇతర వివరాలకు.. 85002 83300.
www.krishnasudhaacademy.org

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్